క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం పరిశీలన



మరికల్: మండలంలోని ఇబ్రహీంపట్నంలో శనివారం తహసీల్దార్ జమీల్ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని, ఎక్కడైనా పొరపాటు జరిగితే చర్యలు తప్పవని నిర్వాహకులకు హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గంలో 'పేట' వాసి



ఎన్నికైన వెంకటేష్

నారాయణపేట రూరల్/ఎడ్యుకేషన్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గంలో నారాయణపేట వాసికి చోటు దక్కింది. ఇటీవల సిద్దిపేటలో నిర్వహించిన ఆ సంఘం 43వ రాష్ట్ర మహాసభలలో కొత్త కార్యవర్గం ఎన్నుకున్నారు. ఈ మేరకు చిట్టెం నర్సిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెకండ్ ఇయర్ చదువుతున్న వెంకటేష్‌ను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. ఈ మేరకు జిల్లా కార్యవర్గ సభ్యులు అభినందనలు తెలిపారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం



నారాయణపేట రూరల్: పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో స్వాములకు శనివారం రైస్‌మిల్ యాజమాన్యం జానకి రమేష్ దంపతులు అన్నదానం చేశారు. అంతకుముందు స్వామివారికి శరణు ఘోషలతో నైవేద్యం సమర్పించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భక్తులకు అన్నదానం చేయడం పుణ్య సార్థకమని అయ్యప్ప దీక్ష మోక్షానికి మార్గమన్నారు. కార్యక్రమంలో గురుస్వాములు ఉమాపతి, మోహన్, సూరి, బాల్‌రాజ్, మహేష్, శ్రీధర్, సుభాష్ పాల్గొన్నారు.

తిరుపతికి పాదయాత్రగా బయలు దేరిన స్వాములు



కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి గ్రామానికి చెందిన స్వాములు శనివారం తిరుమల తిరుపతికి పాదయాత్రగా బయలు దేరారు. ఈ సందర్భంగా ఆలయంలో వారు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం గ్రామస్తులు వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఆదిత్యపరాశ్రీకి డాక్టరేట్



ఊట్కూరు: బిజ్వార్ అంబత్రయ క్షేత్రం పీఠాధిపతి ఆదిత్యపరాశ్రీ స్వామికి శనివారం తమిళనాడులోని వసూర్‌లో ఆసియా ఇంటర్‌నేషనల్ రీసెర్చ్ అకాడమి, హిందూధర్మ పరిషత్ వారు డాక్టరేట్ పట్టా ప్రధానం చేశారు. స్వామిజి ప్రజలకు అధ్యాత్మిక సేవా కార్యక్రమాలు చేపట్టడంతో ఆయనకు డాక్టరేట్ పట్టాను అందజేశారు. ఈ విషయమై ధర్మజాగృతి సమితి జిల్లా నాయకులు కృష్ణయ్య, మహేష్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్ హర్షం వ్యక్తం చేశారు.

రాజ్ కుమార్ రెడ్డికి డాక్టరేట్..

నారాయణపేట: పట్టణంలోని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ కె.రాజ్ కుమార్‌రెడ్డి పేదలకు చేస్తున్న సేవలను గుర్తించి ఏషియా ఇంటర్‌నేషనల్ కల్చరల్ అకాడమి వారు గౌరవ డాక్టరేట్‌ను శనివారం తమిళనాడులోని వసూర్‌లో అందజేశారు. గౌరవ డాక్టరేట్‌ను అందుకున్న కె.రాజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ గౌరవ డాక్టరేట్‌తో తనపై మరింత బాధ్యత పెరిగిందని, భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

ముమ్మరంగా కొనుగోళ్లు



రైతుల ధాన్యం కొనుగోళ్లు

- తీలేర్ సొసైటీలో విరివిగా ధాన్యం సేకరణ
- సన్నాలకు బోనస్ ప్రకటనతో ఆసక్తి చూపిన రైతులు
- కొందరికి సకాలంలో డబ్బులు రావడం లేదని ఆవేదన



తీలేర్ సొసైటీ కొనుగోలు కేంద్రం

మరికల్: ప్రభుత్వం సన్నాలకు బోనస్ ప్రకటించడంతో ఎన్నడు లేని విధంగా తీలేర్ సొసైటీ కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు 70లక్షల ధాన్యం విక్రయాలు కొనసాగాయి. తీలేర్ సింగిల్ విండో సొసైటీ కొనుగోలు పరిధిలో పూసల్‌పహాడ్, రాకొండ, పెద్ద చింతకుంట, తీలేర్ గ్రామాలు ఉన్నాయి. నాలుగు గ్రామాల్లో రైతులు పండించిన సన్నరకం, దొడ్డురకానికి సంబంధించి 365మంది రైతులు 3047 క్వింటాళ్ల వరి ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో అమ్మకాలు జరిపారు. ఇందులో సన్నరకం 2034.520 క్వింటాళ్లు, దొడ్డు రకం 1012.920 క్వింటాళ్ల ధాన్యాన్ని రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇందుకు గాను 345మంది రైతులకు సంబంధించిన బ్యాంకు ఖాతాలో రూ. 70, 69, 040 జమ చేశారు. మరో 20మంది రైతులకు వివిధ కారణాలతో వారి ఖాతాలో ధాన్యానికి సబంధించిన డబ్బులు జమ కాకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో కొందరికి ప్రభుత్వం ప్రకటించిన బోనస్ వస్తే మరికొందరు రైతులకు బోనస్ రాలేదని రైతులు చెబుతున్నారు.

ధాన్యం డబ్బులు రాలేదు..



312 క్వింటాళ్ల ధాన్యం అమ్మి పదిరోజులవుతున్న తమకు ధాన్యం డబ్బులు రాలేదు. నిత్యం తీలేర్ కొనుగోలు కేంద్రం దగ్గరకు వెళ్లి వేస్తున్నాం. ఈ రోజు, రేపు అంటు కాలం వెల్లదీస్తున్నారు. ధాన్యం అమ్మిరోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– రాఘవేందర్, రైతు, రాకొండ

బోనస్ పడలేదు..



20 రోజుల క్రితం తీలేర్ కొనుగోలు కేంద్రంలో 219 క్వింటాళ్ల సన్నరకం ధాన్యం అమ్మాను. ఆరు రోజుల తర్వాత బ్యాంకు ఖాతాలో బోనస్ లేకుండా అసలు రూ. 5లక్షలు జమ చేశారు. మూడు రోజుల్లో బోనస్ వస్తుందని అధికారులు చెప్పారు. కాని 20రోజులు అవుతున్న బోనస్ రాలేదు. బ్యాంకులో అడిగితే తమకు తెలియదంటున్నారు. తనకు బోనస్ కింద రూ. లక్షకుపైగా డబ్బులు రావాలి.

– బాల్‌రెడ్డి, రైతు, రాకొండ

రెండు రోజుల్లో జమచేస్తాం..

రైతులు ఇప్పటివరకు 365మంది తీలేర్ కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం విక్రయించారు. ఇందులో 345మంది రైతుల ఖాతాలో ధాన్యం డబ్బులు జమచేశాం. మరో 20మంది రైతులకు సబంధించిన పట్టాపాస్ పుస్తకాలు, ఆధార్, బ్యాంకు ఖాతాలో సమస్యలు ఉండటంతో వాటిని సరిచేశాం. వారికి కూడా రెండు రోజుల్లో వారి ఖాతాలో జమచేస్తాం. బోనస్ విషయం తాము ఏమి చెప్పలేం.

– కృష్ణ, విండో కార్యదర్శి, తీలేర్

చట్టాలపై ప్రజలకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న లక్ష్మీపతిగౌడ్

ధన్వాడ: చట్టాలపై ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతిగౌడ్ అన్నారు. శనివారం మండలంలోని కిష్టాపూర్, రామకిష్టాయిపల్లి గ్రామాల్లో గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టాలపై అవగాహన పెంపొందించుకుని జ్ఞానాన్ని సంపాదించుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఉచితంగా న్యాయ సేవలు న్యాయ సహాయాన్ని అందించే ఒక గొప్ప అవకాశాన్ని అందించిందని తెలియజేశారు. ఉచితంగా న్యాయ సలహాలు పొందడానికి టోల్ ఫ్రీ నంబర్ 15100కు ఫోన్ చేయవచ్చునని తెలిపారు. అనంతరం జాతీయ వినియోగదారుల సంఘం సభ్యుడు బాలరాజు మాట్లాడుతూ.. రైతులు తాము కొనుగోలు చేసిన విత్తనాలు, క్రిమి సంహారక మందుల బిల్లులు జాగ్రత్తగా ఉంచుకోవాలని, భవిష్యత్‌లో కోర్టులో ఆ రసీదులను సాక్ష్యాలుగా చూపించి నష్టపరిహారం పొందే అవకాశం ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి నవీన్‌కుమార్, ఏఈఓ జైన్‌సింగ్, రాఘవేందర్‌గౌడ్, రజిని, మంగమ్మ, ప్రవీణ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన



సమ్మెలో మాట్లాడుతున్న రామకృష్ణ

నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లాలోని విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణం క్రమబద్ధీకరించాలని, తమ ఉద్యోగ జీవితాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగులు చేపట్టిన సమ్మె కొనసాగుతుంది. శనివారం పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ సమ్మెలో పాల్గొని వీరికి మద్దతు తెలిపి మాట్లాడారు.. గతేడాది ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, ఉపాధ్యక్షుడు గౌస్, రామకృష్ణ, మురళీధర్ తదిరులు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: బీసీ జాగృతి సేన ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్‌ను ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఎడ్ల కుర్మయ్య ఆధ్వర్యంలో శనివారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఆవిర్భావం తర్వాత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. బీసీల ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేందుకు సహకరించాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్న మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేద్దామన్నారు. వెంకటేష్ యాదవ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం, గణేష్, నారాయణ, బాలప్ప, నవీన్ వెంకటేష్, భగత్, రాజు పాల్గొన్నారు.

ప్రకృతి ఆస్వాదన అలవాటుగా మార్చుకుందాం



విద్యార్థులతో ధ్యానం చేస్తున్న వార్ల మల్లేషం

కోస్గి రూరల్: జీవుల మనుగడకు నిలయమైన ప్రకృతిని ఆస్వాదించడం అలవాటుగా మార్చుకుని పరిరక్షించుకోవాలని జాతీయ హరితదళ పాఠశాల స్థాయి సమన్వయ కర్త వార్ల మల్లేషం అన్నారు. శనివారం మండల పరిధిలోని మీర్జాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ప్రకృతి నడక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిపోతున్న కాలుష్యం వల్ల స్వచ్ఛమైన గాలి, నీరు, ఆహారం లభించడం కష్టంగా మారిందని, అభివృద్ధి పేరిట కొనసాగుతున్నా మానవ చర్యలతో అటవీ ప్రాంతాలు తగ్గిపోతున్నాయని అన్నారు. ప్రకృతితో స్నేహం పెంచుకోవడంతో జీవవైవిధ్యం రక్షించుకోవచ్చన్నారు. వివిధ రకాల మొక్కలు, వృక్షాలు, పక్షులను, పరిశీలిస్తూ తమ అనుమానాలను నివృత్తి చేసుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోస్గి రూరల్: పట్టణంలోని 11కెవీ ఫిడర్ పరిధిలోని పలు కాలనీలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం సమీపంలో 100 కెవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు నిమిత్తం సబ్‌స్టేషన్ పరిధిలోని ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



నారాయణపేట రూరల్: మండలంలోని కొల్లంపల్లిలో ఓ ప్రైవేట్ పాఠశాలలోని విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అదేవిధంగా డీఈఓగా అద్విస్చంద్ర, కలెక్టర్‌గా నందిని, ఎంఈఓగా దీపిక, హెచ్ఎంగా శివ వ్యవహరించగా, మరో40 మంది విద్యార్థినీ విద్యార్థులు ఆచార్యులు, మాతాజీలుగా వ్యవహరించి పాఠశాల నిర్వహణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఆచార్య బృందం తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు ధర్మకర్తల మండలి ఎన్నిక

కోస్గి: పట్టణంలో వేణుగోపాలస్వామి ఆలయం, మహాదేవ స్వామి ఆలయాలకు నూతనంగా వంశపార్యంపర రహిత సభ్యులతో ధర్మకర్తల మండలిని ఏర్పాటుచేస్తు దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శనివారం దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటేష్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాలస్వామి ఆలయానికి ధర్మకర్తలుగా మాసాయపల్లికి చెందిన జి. కృష్ణమూర్తి, కోస్గికి చెందిన రత్నమాల, పిరంపల్లి రఘురాములు, అంజిలప్ప, మేడి వెంకటయ్యతో కూడిన ఐదుమందిని ధర్మకర్తల మండలి ప్రతినిధులుగాను జయతీర్థ చారిని ఎక్స్ అఫిసియో సభ్యులుగా నియమించారు. మహాదేవ స్వామి ఆలయానికి సంబంధించి మజ్జిగ సోమశేఖర్, వేపూర్ వెంకట్రాములు, వెంకటయ్య, మన్నె రమేష్, పుట్టి నాగమ్మను ధర్మకర్తల మండలి ప్రతినిధులుగాను మఠం విశ్వనాథంను ఎక్స్ అఫిసియో సభ్యులుగా నియమించారు.

విద్యార్థులు దేశం గర్వించే స్థాయికి ఎదగాలి

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులు బాగా చదివి దేశం గర్వించే స్థాయికి ఎదగాలని ప్రవాస భారతీయుడు కృష్ణబాబు అన్నారు. శనివారం మండలంలోని పిన్నంచర్ల ప్రభుత్వ పాఠశాలలో గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, వందనమ్మ దంపతుల కుమారుడు ఎన్ఆర్ఐ కృష్ణబాబు విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేశారు.

చిన్నారులకు పలకలు పంపిణీ

పిన్నంచర్ల అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు సింగిల్‌విండో డైరెక్టర్ అజ్జపాగ మాసన్న, సరిత దంపతుల ఆధ్వర్యంలో తమ కుమారుడు వివేక్ పుట్టినరోజు సందర్భంగా పలుకలు, చాక్లెట్లను పంపిణీ చేశారు.

ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలి



మద్దూర్‌లో ఇందిరమ్మ ఇళ్లసర్వేను పరిశీలిస్తున్న శిక్షణ కలెక్టర్ గరిమానరుల

ఊట్కూరు: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. శనివారం మండలంలోని మల్లెపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. సర్వే నిర్వహిస్తున్న అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను కలిసి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పల్లెర్లలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

కోస్గి/మద్దూరు: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని శిక్షణ కలెక్టర్ గరిమానరుల అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని 8వ వార్డులో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆమె పరిశీలించారు. అలాగే పల్లెర్లలో సర్వే మందకొడిగా సాగడంపై సర్వే సిబ్బందిని, అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో 11,150 ఇళ్లను సర్వే చేసినట్లు ఎంపీడీఓ నర్సింహారెడ్డి ఆమెను సూచించారు. ఎంపీఓ రామన్న, మున్సిపల్ కమిషనర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా చూడాలి..

ధన్వాడ: ఇళ్ల సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని డిప్యూటీ సీఈఓ జ్యోతి అన్నారు. శనివారం మండల కేంద్రంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆమె పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఇళ్ల సర్వేలో వేగం పెంచాలని కార్యదర్శులకు సూచించారు. ఈ నెల చివరి నాటికి సర్వేను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయిప్రకాష్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రావు తదితరులు ఉన్నారు.



మల్లెపల్లిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్



ధన్వాడలో సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈఓ జ్యోతి

ఈవీఎం గోదాంల పరిశీలన

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న ఈవీఎం గోదాంను శనివారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. అంతకుముందు ఈవీఎం గోదాంను అన్ని రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బేన్‌షాలం ఆధ్వర్యంలో బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్స్ బాక్సులను పరిశీలించారు. గోదాంలో సీసీ కెమెరాలు పని చేస్తున్నాయా ? లేదా అని, అలాగే అగ్ని ప్రమాద నివారణ యంత్రాలు అందుబాటులో ఉన్నాయా లేదా అని కలెక్టర్ అడిగారు. 13 కెమెరాల నిఘాలో గోదాం ఉందని, ఫైర్ సేఫ్టీ ఉందని ఆర్డీఓ రాంచంద్రనాయక్ కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆర్డీఓ, వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలోనే మళ్లీ ఈవీఎం గోదాంకు తాళం వేసి సీజ్ చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మక్తల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు

నారాయణ పేట టౌన్: సమస్యలు పరిష్కరించాలని వివిధ గ్రామాలకు చెందిన మల్టీపర్పస్ కార్మికులు సీఐటీయూ, టీయూసీఐ పలు సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ముట్టడించేందుకు స్థానిక అంబేడ్కర్ చౌరస్తా నుంచి పెద్ద ఎత్తున ర్యాలీగా బయలుదేరారు. కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు అక్కడే రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వామపక్ష నాయకులు మాట్లాడుతూ.. కనీస వేతనం రూ.18వేలు పెంచాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి, కేటగిరీల వారీగా వేతనాలు ఇవ్వాలన్నారు. అనంతరం తహసీల్దార్ అమరేంద్రకు పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బలరాం, పలువురు వామపక్ష నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల పట్ల వివక్ష తగదు..

మక్తల్: పంచాయతీ కార్మికుల పట్ల వివక్ష తగదని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కిరణ్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట రెండవ రోజు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్, నాయకులు నర్సింహ, నర్సింహులుగౌడ్, లక్ష్మణ్, సుశాంత్, నరేష్, వెంకటయ్య, చంద్రప్ప, సాయప్ప, హన్మంతు, మహేష్, మల్లేష్, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ. 18వేలు ఇవ్వాలి..

మాగనూర్: కార్మికులకు కనీస వేతనం రూ. 18వేలు ఇవ్వాలని సీటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి. ఆంజనేయులు అన్నారు. రెండవరోజు టోకెన్ సమ్మెలో భాగంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్టాడ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా కార్మికులకు కనీస వేతనం అందజేయాలని అన్నారు. వీటితో పాటు మరికొన్ని న్యాయపరమైన డిమాండ్లను నేరవేర్చాలని కోరారు. అశోక్, వెంకటప్ప, రాకేష్, హనీఫ్, హన్మంతు, నారాయణ, తిమ్మప్ప పాల్గొన్నారు.



పేటలో తహసీల్దాకు వినతి పత్రం అందిస్తున్న కార్మిక నాయకులు



మాగనూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేద్దాం

నారాయణపేట రూరల్: నల్గొండ జిల్లాలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న టీఎస్ యూటీఎఫ్ సంఘం ఆరవ మహాసభలను విజయవంతం చేద్దామని ఆ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం ఆ సంఘం నాయకులు, పలువురు ఉపాధ్యాయులు ప్రత్యేక వాహనాల్లో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య, వైజ్ఞానిక మహాసభలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ముఖ్యవక్తగా జవాహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ మాజీ అధ్యక్షురాలు ఐషి గోష్, పత్రిక సంపాదకులు కె శ్రీనివాస్ విచ్చేస్తున్నారని తెలిపారు. ఈ మహాసభలలో నూతన జాతీయ విద్యావిధానం, ప్రపంచ సమకాలీన ఆర్థిక, రాజకీయ పరిస్థితులు గురించి చర్చించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు వేణుగోపాల్, వెంకటస్వామి, బాలాజీ, జయశ్రీ, భీమయ్య, రవి కుమార్, మోహన్, రాజు, రాములు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.